# దైవానికి ప్రీతికరమైన కర్మలు ఆచరించండి!

కర్మమున పుట్టు జంతువు
కర్మమున వృద్ధి పొంది కర్మమున చనున్
కర్మమె నరునకు దైవము
కర్మమె సుఖదుఃఖములకు కారణమిలలో!

కర్మయే నరునకు ప్రాణము. ప్రతి మానవుడు తెల్లవారి లేచినది మొదలు రాత్రి పరుండునంతవరకు తాను చేసే కర్మలు ఎటువంటివో గుర్తించుకొని చేయాలి. ఇది మానవునియొక్క ప్రధాన కర్తవ్యం. గబ్బిలములు అన్ని పక్షులవలె ఆకాశములో సంచరించి వృక్షములపై వ్రాలి విశ్రాంతి తీసుకుంటాయి. కాని, అవి మిగిలిన పక్షులవలె కాక తల క్రిందికి, కాళ్ళు పైకి పెట్టుకొని చెట్టుకొమ్మలకు వ్రేలాడుతుంటాయి. ఎవరైనా వాటికి దారం చుట్టి తలక్రిందులుగా చెట్టు కొమ్మలకు కట్టారా? లేదు. వాటి కర్మానుసారమే ఆవిధముగా జరుగుతుంది. పరీక్షలో టీచర్లు అడిగిన ప్రశ్నలన్నింటికీ సరియైన జవాబులు వ్రాస్తే మీకు చక్కని మార్కులు వస్తాయి. అందులో తప్పులేమైనా వ్రాస్తే మీ మార్కులుకూడా తగ్గిపోతాయి. అదేరీతిగనే, మనం ఎట్టి కర్మలు చేస్తామో మనకు అట్టి ఫలితమే వస్తుంది. చెడ్డ సంకల్పములు, చెడ్డ కర్మలు చేసినప్పుడు వాటికి ఫలితంగా చెడ్డనే అనుభవిస్తాము; మంచి కార్యములు చేసినప్పుడు వాటికి తగినట్లుగా మంచి ఫలితములే పొందుతాము. కాని, ఈనాటి మానవుడు చెడ్డను చేసి మంచిని పొందాలని ఆశిస్తున్నాడు. మంచిని చేసి చెడ్డను పొందాలని ఎవ్వరూ కోరుకోరు. అయితే, దేనికి తగిన ఫలితము దానికి తప్పదు.

ప్రతి వ్యక్తికూడను తాను ఆచరించే కర్మలయొక్క మంచిచెడ్డలను విచారించాలి. చెడ్డ కర్మలు చేయడం పశులక్షణం. మంచికర్మలు ఆచరించడమే మానవునియొక్క ప్రధాన

srisathyasaivachanamrutam

కర్తవ్యం. ఏ కర్మలు చేయడానికి పూనుకున్నప్పటికీ "నేను మనిషిగా ప్రవర్తిస్తున్నానా? లేక పశువుగా ప్రవర్తిస్తున్నానా?' అని ఎవరిని వారు ప్రశ్నించుకోవాలి. మనము మానవులుగా పుట్టాము, మానవుల మనిపించుకున్నాము. కాబట్టి, మనం మానవులవలె ప్రవర్తించాలి. మానవులుగా పుట్టి, పశువులుగా ప్రవర్తించడం మానవత్వానికి అవమానం. మానవుడు ఏదైనా చెడ్డ పని చేస్తే "అయ్యా, నీవు మానవుడవై పుట్టి పశువులా ప్రవర్తిస్తున్నావే" అని ప్రక్కనున్నవారుకూడను మందలిస్తారు, దండిస్తారు. ఈవిధంగా మానవునిచేతనే మానవుడు శిక్షింపబడతాడు. మనం చేసిన తప్పుకు తగిన శిక్షకోసం భగవంతుని వరకు పోనక్కర్లేదు; మనం చేసినటువంటి పనులనుంచియే ఫలితము వస్తుంది.

**చెడ్డపని చేసి మంచిని చెందబోరు**
**మంచిపని చేసి కీడును గాంచబోరు**
**నిమ్మమును నాటి చూతఫలంబు గనునా!**
**నిమ్మఫలమును గనున చూతంబు నాటి!**

మనము మంచి పనులు చేయడానికే మానవులుగా పుట్టామని గుర్తించాలి. 'మానవ' అనే పదంలో 'మా' - అనగా అజ్ఞానం, 'న' - అనగా లేకుండా, 'వ' - అనగా వర్తించడం. అజ్ఞానం లేకుండా ప్రవర్తించేవాడే మానవుడు. కాకులు అరుస్తుంటే వాటిని రాళ్ళతో కొడతాము. చిలుక పలుకులను మాత్రం ఎంతో ఆనందంగా వింటాము. కోకిల గానముకూడా ఎంతసేపైనా వినాలనే అనిపిస్తుంది. అనగా, మన మాటలు, ప్రవర్తన మంచిగా ఉన్నప్పుడే సమాజంలో గౌరవ, మర్యాదలను పొందుతాము. కాబట్టి, Help ever, hurt never. అందరికీ సహాయపడాలి. మన మాటలతోగాని, చేతలతోగాని ఎవరినీ బాధించకూడదు. కాని, మనం చేసే పని ఇతరులకు బాధ కలిగిస్తుంది అని తెలిసినప్పటికీ మనం ఆ పని చేసి ఇతరులను బాధిస్తుంటాము. తెలిసి చేస్తే అది మరింత తప్పు. పరులను పరిహసించడం, దూషించడం, హింసించడం మానవ స్వభావం కాదు. మానవునికి మానవుడు సహాయంగా ఉండాలి. అందరినీ సోదరసోదరీమణులుగా ప్రేమించాలి. మానవునికి జంతువులే ఎంతో సహాయం చేస్తుంటే, మానవునికి మానవుడు సహాయం చేయడంలో గొప్పతనమేమున్నది!

sri sathyasai vachanamrutam

**మానవత్వమే మన ముఖ్యమైన ఆస్తి**

మానవునికి మనస్సు, బుద్ధి, చిత్తము ఇచ్చాడు, భగవంతుడు. ఆ మనస్సును మంచిమార్గంలో పెట్టడంగాని, లేక చెడ్డమార్గంలో పెట్టడంగాని మనిషిపైననే ఆధారపడి ఉంది. దీనిని పురస్కరించుకొనియే వేదాంతమునందు "మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" అన్నారు. మానవునియొక్క బంధ మోక్షములకు మనస్సే కారణం. కాబట్టి, భగవంతుడు ఇచ్చిన మనస్సును మనం మంచిమార్గంలో ప్రవేశ పెట్టాలి. "దైవం మానుష రూపేణ." మానవులందరిలో ఉన్న దైవం ఒక్కడే అనే సత్యాన్ని గుర్తించాలి. మానవ రూపంలో అవతరించిన దైవంయొక్క ఆజ్ఞను శిరసావహించాలి. దైవానికి ప్రీతికరమైన కర్మలను ఆచరించాలి. మీ స్నేహితుని మాట కాదు మీరు వినవలసింది; భగవంతుని ఆజ్ఞను అనుసరించి మీరు ప్రవర్తించాలి; మానవత్వాన్ని పోషించుకోవాలి; 'మంచి మానవుడు' అనిపించుకోవాలి. అప్పుడే మీ మానవ జన్మ సార్థకమౌతుంది. మానవత్వాన్ని మరచి ఎన్ని జపములు, తపములు, యజ్ఞములు చేసినప్పటికీ ప్రయోజనం లేదు. మానవత్వాన్ని నిలుపుకున్నవాడే నిజమైన మానవుడు.

మానవజన్మ చాలా పవిత్రమైనది. ఇది ఎన్ని జన్మల పుణ్యఫలమో! కనుకనే, 'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్నారు. ఇట్టి దుర్లభమైనటువంటి మానవత్వాన్ని వ్యర్థం చేసుకోకూడదు. అసత్యమాడటం, అన్యాయం చేయటం, అక్రమాలకు పాల్పడటంవల్ల మానవత్వాన్ని పూర్తిగా కోల్పోయినవారమవుతాము. See good, do good, be good (మంచినే చూడాలి, మంచినే చేయాలి, మంచిగా ఉండాలి) ఇదే నిజమైన మానవత్వం. కాని, కొందరు చెడ్డ చూపులు చూస్తూ పైకి మంచివారి వలె కనిపిస్తారు. ఒకటి చెప్పటం, మరొకటి చేయటం మంచిది కాదు. "మనస్యేకం, వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం." మనోవాక్కాయ కర్మలు ఏకం కావాలి. ఈ 'యూనిటీ' (ఏకత్వం) ఉన్నప్పుడే 'ప్యూరిటీ' (పవిత్రత) వస్తుంది. 'ప్యూరిటీ' నుండి 'డివినిటీ' (దివ్యత్వం) ఆవిర్భవిస్తుంది. ఎవరైనా మనల్ని దూషించారనుకోండి. అదికూడను మన మంచికోసమే అని భావించుకోవాలి. ఎవరేమి చేసినప్పటికీ అంతా మన మంచికోసమేనని భావించాలి. మనం

ఆచరించే సర్వకర్మలుకూడను మనలను తరింపజేసేవిగా ఉండాలి. ఏ 'ప్రోపర్టీ' (ఆస్తి) పోయినప్పటికీ ఫరవాలేదుకాని, మన మానవత్వాన్ని మాత్రం పోగొట్టుకోకుండా చూసుకోవాలి. మానవత్వమే మన ముఖ్యమైన 'ప్రోపర్టీ'. మానవుడు ఎల్లప్పుడు చిరునవ్వులు చిందిస్తూ ఆనందంగా ఉండాలి. ఐతే, అనవసరంగా నవ్వటం మంచిది కాదు.

**సత్సంగంలో చేరి సద్భావాలను అలవర్చుకోవాలి**

మానవుడు ఆరోగ్యంగా ఉండాలి. ఆరోగ్యమంటే కేవలం దేహారోగ్యం కాదు; సంకల్పములుకూడను ఆరోగ్యకరమైనవిగా ఉండాలి. సదాలోచనలను అభివృద్ధి చేసుకోవాలి. దీనినే 'మానసిక ఆరోగ్యము' అన్నారు. సత్కర్మలవల్ల సద్భావాలు కలుగుతాయి. సద్భావాలు కలిగినప్పుడు దుర్భావాలు భస్మమైపోతాయి. Love all, serve all (అందరినీ ప్రేమించండి, అందరినీ సేవించండి). అప్పుడే మీరు సంపూర్ణమైన ఆరోగ్యాన్ని పోషించుకున్నవారవుతారు. మనం మంచి పనులు చేస్తూ మంచి ఫలితమును అనుభవించాలి. అప్పుడే మనకు మంచి ఆరోగ్యం చేకూరుతుంది. మంచి ఆరోగ్యంవల్ల మంచి ఆలోచనలు వస్తాయి. పవిత్రమైన ఆలోచనలు రావాలంటే మనము తీసికొనే ఆహారం పవిత్రంగా ఉండాలి. తినరాని తిండి తినకూడదు. భగవంతునికి ఏదంటే అది పెట్టము కదా! పరిశుద్ధమైన పాత్రలో, పవిత్రమైన, సాత్వికమైన ఆహారమును భగవంతునికి అర్పించాలి. భగవంతునికి అర్పితం చేసిన పవిత్రమైన పదార్థాలను మనము భుజించాలి.

మన ఆహార విహారములవలన మనకు కొన్ని చెడ్డ భావములు వస్తుంటాయి. సద్భావములను అలవర్చుకోవడానికి మనం సత్సంగంలో ప్రవేశించాలి. అసూయ, క్రోధము, అహంకారము ఉండకూడదు. Tell me your company, I shall tell you what you are. నీవు సత్సంగంలో ఉంటే మంచివాడవవుతావు; దుస్సంగంలో చెడ్డవాడవవుతావు.

**సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం**
**నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తి**

srisathyasaivachanamrutam

ఇక్కడ ఇన్నివేలమంది చేరారు. ఎందుకోసం? దైవత్వంకోసం చేరారు. అట్లుగాకుండా, మీరు లిక్కర్ షాపుకు వెళితే ఈవిధమైన మంచి భావములు మీకు ఎలా కలుగుతాయి?! మీరు ధూమపానము, మద్యపానము, మాంసభక్షణ ఇత్యాది దురభ్యాసములకు లోనై 'నేను మంచివాడను' అని చెప్పుకుంటే ఎవ్వరూ ఒప్పుకోరు. మీరు మంచివారనిపించుకోవాలంటే మంచి పనులు చేయాలి. కాని, ఈనాటి మానవుడు చెప్పేది ఒకటి, చేసేది మరొకటి.

ఒక సన్యాసి ఒక ఇంటి ముందు నిలబడి 'భవతీ భిక్షాం దేహి' అన్నాడు. ఆ ఇల్లాలు బయటికి వచ్చి, "నాయనా! నదికిపోయి స్నానం చేసిరా. నీకు భోజనం పెడతాను" అన్నది. కాని, ఆ సన్యాసి వట్టి సోమరి. "అమ్మా, మాబోటి సాధువులకు గోవిందేతి సదా స్నానం" అన్నాడు. ఆ ఇల్లాలు చాలా తెలివైనది. "నాయనా! గోవిందేతి సదా భోజనం, వెళ్ళిరా" అన్నది. స్నానం చేయటానికి ఇష్టం లేక సోమరితనంతో 'గోవిందేతి సదా స్నానం' అనటంలో అర్థం లేదు. 'గోవిందేతి సదా స్నానం' అన్నప్పుడు 'గోవిందేతి సదా భోజనం' అని ఎందుకనుకోకూడదు!

**నీ మంచితనమే నిన్ను రక్షిస్తుంది**

ఎవరు మనకు ఏ చిన్న ఉపకారం చేసినా వారికి మనం తగిన కృతజ్ఞత చూపాలి. అటువంటివారు ఎక్కడ ఉండినప్పటికీ, ఏమి చేసినప్పటికీ తప్పక సత్ఫలితాలను పొందుతారు. డబ్బిచ్చినవానికి తిరిగి డబ్బిచ్చేస్తే అతడు తృప్తి పడవచ్చు. కాని, కేవలం డబ్బు ఇచ్చేస్తే సరిపోదు, ప్రేమను ఇవ్వాలి. ఆ కృతజ్ఞతను హృదయంలో పెట్టుకోవాలి. అప్పుడే మీరు నిజంగా ఋణం తీర్చుకున్నవారవుతారు. కొందరు ఎంతో మంచి చేసినవారికికూడా ద్రోహం చేస్తారు. అది మంచిది కాదు. మానవునికి కృతజ్ఞత చాలా ప్రధానం. కృతజ్ఞత లేకపోతే అన్నీ వ్యర్థమైపోతాయి. మన జీవితమంతా 'రియాక్షన్, రీసౌండ్, రిఫ్లెక్షన్'లతో కూడి ఉంటుంది. మనకు ఎదురైన వ్యక్తి మన ద్వేషి అయినప్పటికీ అతనికి నమస్కరించి, 'ఏమండీ' అని మనం మంచిగా మాట్లాడితే, అతనుకూడా గౌరవంగా 'ఏమండీ' అంటాడు. మనం క్రోధంతో 'ఏమిరా' అంటే అతనుకూడా 'ఏమిరా' అంటాడు.

srisathyasai vachanamrutam

మనము కష్టపడి చదవకుండా పరీక్షలో మంచి మార్కులు రావాలంటే ఎప్పటికీ రావు. కష్టపడి చదివినప్పుడే ఫస్టు క్లాసు మార్కులు వస్తాయి. కష్టపడి చదవకపోయినా నీకు ఒకవేళ మంచి మార్కులు వస్తే నీవు పరీక్షలో కాపీ కొట్టి ఉంటావు. నీకు మంచి మార్కులు వస్తే, నీవు మంచిగా రాశావా? లేక, కాపీ కొట్టావా? అనేదానికి నీ మనస్సే నీకు సాక్షి. కనుక, మనం మంచిని చేసి మంచిని అనుభవించాలి. అప్పుడే మనుష్యులమై పుట్టినందుకు సార్థకత పొందుతాము. నిన్ను రక్షించుమని నీవు దైవాన్ని ప్రార్థించనక్కర్లేదు; నీ మంచితనమే నిన్ను రక్షిస్తుంది. అదే నీకు నిజమైన 'సపోర్టు'. ఈనాటి లాయర్లు 'విట్నెస్... విట్నెస్...' (సాక్ష్యం... సాక్ష్యం) అంటారు. కాని, మనకు ఇంకొకరి సాక్ష్యం అక్కర్లేదు. మన మనస్సే మనకు సాక్షి. మన హృదయానికి సమ్మతమైన కర్మలను ఆచరించాలి. ఆత్మతృప్తి చాలా ప్రధానం. ఆత్మతృప్తి కల్గినప్పుడే స్వార్థత్యాగం సాధ్యమౌతుంది.

విద్యార్థులారా! మీరు ఇప్పటినుంచి చక్కని భావాలను అభివృద్ధిపరచుకోవాలి. మీరు విద్యార్థులు కాబట్టి, విద్యను ఆర్జించాలి. ఎట్టి విద్య? ఆత్మవిద్య. అంతేకాదు. ఆత్మతృప్తికోసం మీరు పాటుపడాలి. ఇదే నిజమైన విద్య. మంచి భావాలు పెంచుకోకుండా కేవలం పెద్దపెద్ద గ్రంథాలు చదివితే ప్రయోజనం లేదు. చాలామంది ఎప్పుడు చూసినా చదువుతూ చదువుతూ ఉంటారు. అది చూసి "మా పిల్లవాడు రాత్రింబవళ్ళు చదువుతున్నాడు" అని తల్లిదండ్రులు అనుకుంటారు. కాని, ఏమి చదువుతున్నాడో ఏమిటో వారికి తెలియదు. కొందరు పిల్లలు పెద్దపెద్ద పుస్తకాలమధ్య పిచ్చిపిచ్చి కథలు పెట్టుకొని చదువుతుంటారు. అది తెలియక తల్లిదండ్రులు, "ఆహా... మా పిల్లవాడు మహాభారతం చదువుతున్నాడు" అనుకొని ఆనందిస్తుంటారు. ఆవిధంగా చేయడంచేత విద్యార్థుల జీవితం నాశనమైపోతుంది; సమాజంలో వారికి గౌరవముండదు. మనకు ఏది మంచిదో తెలుసుకొని దానిని మాత్రమే చదవాలి. మానవత్వానికి విరుద్ధమైన మార్గాన్ని బోధించే పుస్తకాలు చదవకూడదు.

మొట్టమొదట విద్యార్థులు కోపాన్ని అరికట్టుకోవాలి. సహనం సాధించాలి. శాంతంగా ఉండాలి. అప్పుడే తాము చదివే చదువుకు సరియైన అర్థాన్ని తెలుసుకోగలరు. విద్యార్థులు ఈ వయస్సులో చాలా పవిత్రమైన హృదయం గలవారుగా ఉంటారు. కాబట్టి,

srisathyasaivachanamrutam

ఇప్పటినుండియే విద్యార్థులు భగవంతునికి అర్పిత మయ్యే భావాన్ని అలవర్చుకోవాలి. భగవంతుణ్ని మనం సంతోషపెట్టాలి. అప్పుడు ప్రపంచంలో అందరినీ సంతోషపెట్టినవారమవుతాము. భగవంతుణ్ని మనం సంతృప్తిపరుస్తే అందరూ సంతృప్తిపడతారు.

మనకు సుఖం కావాలని ఆశిస్తున్నాము. అయితే, సుఖం ఎక్కడ ఉంది? "హరి భజన బినా సుఖ శాంతి నహీ", అందువల్లనే గురునానక్ సామూహిక భజనను ప్రారంభించాడు. కొంతమంది నిద్రపోతూ భజన చేస్తుంటారు; మరికొంతమంది మనస్సు ఎక్కడో పెట్టుకొని చేస్తుంటారు. కాని, పదిమంది చేరితే ఏ ఒక్కరి మనస్సైనా నేరుగా భగవంతునిపై ఉంటుంది. కనుక, పదిమంది చేరి భజన చేయడం చాలా మంచిది. అప్పుడే భగవంతుని హృదయం ఆనందంతో నిండిపోతుంది. శివరాత్రి అనగా మంగళకరమైన రాత్రి. ప్రతి దినమూ రాత్రి వస్తూనే ఉంది. కాని, అన్ని రాత్రులూ శివరాత్రులు కావు. భగవన్నామమును స్మరించిన రాత్రే నిజమైన శివరాత్రి. కనుక, మీరు మిగిలిన రాత్రులు చేయకపోయినప్పటికీ ఈ శివరాత్రినాడైనా మీ హృదయంలో మంచి భావమును చేర్చుకొని భగవన్నామమును స్మరించాలి.

**- తేదీ 7.3.2008, శివరాత్రి సందేశం - 2,**
**సాయికుల్వంత్ సభామండపం**

sri sathyasai vachanamrutam